# ప్రవాసాంధ్రుల పేజీ

- సాక్షి.

**సుశ్రీ సిద్ధేశ్వరీ దేవి గారి (దీదీ) సెయింట్‌లూయిస్ సందర్శన విశేషాలు**
**జనవరి 17 నుండి జనవరి 24 వరకు.**

17వ తారీఖున సాయంత్రము 7 గంటల నుండి 9 వరకు సిద్ధేశ్వరీ దేవిగారు ఒక భక్తును ఇంటిలో భక్త బృందాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భములో ఆవిడ జగద్గురు శ్రీ కృపాలు మహరాజ్ గారితో ఆమె అనుభవాలు, గురువు-శిష్యుల సంబంధము, బ్రహ్మానందస్థితిని గురించి ఎన్నో విషయములు చర్చించారు. జనవరి 19వ తేదీన ఆవిడ సెయింట్‌లూయిస్ హిందూ దేవాలయములో 11 గంటలనుండి 12:30 నిమిషములవరకు ప్రసంగించారు. ఈ సందర్భములో ఆవిడ భక్తిని గురించి, భాగవతోత్తముల కథలు, బ్రహ్మానంద స్థితిని కలుగజేసే భక్తిని గురించి తెలియజేసారు. జనవరి 20వ తేదీన సాయంత్రము 6 గంటల నుండి 9 వరకు భక్తియోగమును ఆచరించడం గురించి, అంచెలంచెలుగా కొన్ని నిమిషములతో మొదలుపెట్టి నిత్యము ఆ యోగస్థితిలో ఉండడము ఎలా సాధ్యమో తెలియజేసారు.



*సెయింట్‌లూయిస్ హిందూ దేవాలయములో ప్రసంగిస్తూ సుశ్రీ సిద్ధేశ్వరీదేవి.*

జనవరి 21వ తారీఖున 10 గంటలనుండి 11 వరకు ఆవిడ సెయింట్‌లూయిస్ వైదిక దేవాలయము ప్రాంగణములో కొన్ని భజనలను గానం చేసి, గురువుల కృపను గురించి, వారి అమృతవాక్కులను గురించి, భాగవతములోని కొన్ని ఘట్టములను మనస్సుకు హత్తుకునేటట్లు తెలియజేసారు. శ్రీకృష్ణుని గురించి, యశోద గురించి ఆమె చెప్పిన కొన్ని సన్నివేశాలకు పిల్లలు ఉత్సాహముగా స్పందించడం, చర్చలో పాల్గొనడం విశేషం.



*సెయింట్‌లూయిస్ వైదిక దేవాలయము ప్రాంగణములో భజనలను గానం చేస్తూ సిద్ధేశ్వరీదేవి.*

జనవరి 23వ తారీఖున సాయంత్రం 7గంటలు మొదలు 9 వరకు దీదీజీ కొన్ని భజనలను పాడి, భక్తుల సందేహనివృత్తి చేసారు. ఆమె ప్రసంగంలో ఎక్కువ ముందుతరమును (పిల్లలను) ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఆమె పిల్లలను భక్తి గురించి వారి అభిప్రాయములను అడిగి, భక్తి వారికి ఏవిధముగా ఉపయోగపడుతుందో తెలియజేస్తూ కొన్ని చక్కని కథలను చెప్పారు. ఈ సందర్భములో పెద్దలు సత్యము, అహింస, ప్రేమ మొదలైన విలువలను పాటించి పిల్లలకు ఆదర్శప్రాయమవ్వాలని సందేశాన్ని అందించారు. రాధామాధవ్ సంస్థ వివరములకు www.radhamadhavsociety.org ను సందర్శించండి.

*** *** ***

**'నిత్యధ్యాన్' ధ్యాన పద్ధతి** **తేదీ : మార్చి 26, 2008.**

**సమయము : మధ్యాహ్నము 4 గంటల నుండి సాయంత్రము 7 గంటల వరకు.**

**వేదిక : శ్రీకనకమహాలక్ష్మి కల్యాణమంటపము, విశాఖపట్నము.**

పరమహంస శ్రీ నిత్యానంద స్వామీజీ అనుగ్రహముతో శ్రీనివాసరావు అయినాపురపు స్వామీజీతో తన అనుభవాలు, మన శరీరములో ముఖ్యమైన శక్తికేంద్రములు (ఏడు చక్రములు) మరియు 'నిత్యధ్యాన్' ధ్యాన పద్ధతిని వివరించారు. ఆయన శ్రీ స్వామీజీకి, ఆధ్యాత్మిక గురువులకు కృతజ్ఞతలను తెలిపి; ఈ కార్యక్రమము ద్వారా ఏదైతే మంచి వ్యక్తీకరించబడినదో దానికి ప్రశంసలు గురుదేవులకు చెందుతాయని, ఒకవేళ ఏమైనా తప్పులు దొర్లితే ఆ బాధ్యత తనదేనని తెలియజేసారు. ఈ కార్యక్రమము జరిగిన 3 గంటల సమయములో, హాజరైన సాధకులు అందరూ శ్రీనివాసరావు తెలియజేసిన విషయాలను ఎంతో ఆసక్తితో వినడం, చాలామంది ఎలాంటి ఇబ్బంది లేకుండా నేలపైనే కూర్చొని ధ్యానం చెయ్యడం విశేషం. తన అనుభవాలతో పాటు, తను సాధన చేసిన విషయములు, కొన్ని సూత్రములను జీవితములో భాగముగా చేసుకున్న విషయములను (25 మందితో కూడిన సత్సంగములో) శ్రీనివాసరావు అందరితో పంచుకున్నారు. ఈ ధ్యానము అనంతరము చాలామంది ఈ ధ్యానపద్ధతిని నిత్యమూ సాధన చేస్తామని, ధ్యాన సమయములో వారు ఎంతో ప్రశాంతతను పొందినట్లు తెలియజేయడం ప్రశంసనీయం. ఇందులో పాల్గొన్న కొందరు సాధకులు ముప్పై ఐదు నిమిషములు ధ్యానములో కూర్చున్నా వారు ఎలాంటి మోకాలి నొప్పులు అనిపించలేదని తెలియజేసారు. నిత్యధ్యాన్ మరియు ఇతర ధ్యాన పద్ధతుల కొఱకు http://www.dhyanapeetam.org ని వీక్షించండి.

*** *** ***

### *పాఠకులకు సదవకాశము*

*మీరు మీ ప్రాంతములలో నిర్వహించబడిన సాహిత్య సమావేశములగురించిగాని, సాంస్కృతిక కార్యక్రమాలగురించిగాని, పండుగలకు సంబంధించిన సమావేశములగురించి మాకు పంపిస్తే ఆ విషయములను సంఘమిత్రలో ప్రచురిస్తాము. ఈ విధముగా ఎన్నో విషయములు తెలుసుకునే అవకాశము కలుగుతుంది. కార్యక్రమము గురించిన వివరములతో పాటు ఫొటోలు కూడా పంపితే బాగుంటుంది. సరే త్వరపడండి. జనవరి, ఏప్రియల్, జులై, అక్టోబరు నెలలలో విడుదలయ్యే సంఘమిత్ర సంచికలలో ప్రచురించడానికి వరుసగా నవంబరు 30, మార్చి 1, మే 31, ఆగష్టు 31 లోగా http://www.sanghamitra.orgకి పంపితే సౌకర్యంగా ఉంటుంది.*

బెంగ అనేది చీకటి గది లాంటిది. అక్కడ ఋణచ్ఛాయాచిత్రములు ప్రకటితమౌతాయి (నెగెటివ్స్ డెవలప్ అవుతాయి). తస్మాత్ జాగ్రత్త!

**శ్రీనివాసరామానుజన్ మేధమేటిక్స్ క్లబ్‌చే నిర్వహించబడిన మేధావధానము.**

**తేదీ : మార్చి 27, 2008.**

**సమయము : ఉదయము 11 గంటల నుండి మధ్యాహ్నము 1 గంట వరకు.**

**వేదిక : దక్షిణ ఇల్లినోయిస్ విశ్వవిద్యాలయము, ఎడ్వర్డ్స్‌విల్లి (SIUE Campus).**

శ్రీనివాసరామానుజన్ మేధమేటిక్స్ క్లబ్‌చే SIUE ప్రాంగణములో నిర్వహించబడిన మేధావధానము పలువురి ప్రశంసలతో విజయవంతమైనది. ఇందులో చిరంజీవి అయినాపురపు శ్రావ్యశ్రీ ఘనమూలములను, ఇచ్చిన సంఖ్యను 9 చే భాగించగా వచ్చు శేషమును, 5 వరుసల కూడికను - కాగితము, కలము, గణనయంత్రము (కాలిక్యులేటర్) వంటివి ఉపయోగించకుండా కొన్ని సెకనుల కాలములోనే తెలియజేసి అందరినీ ఆశ్చర్యపరచింది. నాల్గవ తరగతి చదువుతున్న ఈమె ప్రేక్షకుల ప్రశ్నలకు ఏమాత్రమూ భీతి చెందకుండా సమాధానములు చెప్పడం విశేషం.



**శ్రావ్యశ్రీ ని అభినందిస్తూ *SIUE* కార్యకర్త.**

కార్యక్రమము చివరలో కొన్ని సమస్యలకు సమాధానము చెప్పడానికి ఉపయోగిస్తున్న సూత్రాన్ని, వివరించడం జరిగింది. పిల్లలను ఈ విధముగా ప్రోత్సహిస్తూ, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి అవకాశమిచ్చిన SIUE కి ధన్యవాదములు.

*** *** ***

**వైదికశాస్త్ర వర్ణమాల' అనే అంశముపై జాతీయ సదస్సు.**

**National Seminar on 'The Spectrum of Vedic Sciences'.**

**తేదీ : మార్చి 29, 2008.**

**సమయం : ఉదయం 9:30 నిమిషముల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు.**

**వేదిక : బిల్డర్స్ అసోసియేషన్ హాల్, సిరిపురం, విశాఖపట్నం.**

ఇది ఒకరోజు సదస్సు అయినప్పటికీ, వైదిక విజ్ఞానాన్ని వివిధ కోణములలో అధ్యయనం చేసిన పలువురి వక్తల ప్రసంగాలతో ఎందరికో స్ఫూర్తినిచ్చేవిధముగా సాగింది. లోహసంగ్రహణ శాస్త్రము, ఆధునిక విజ్ఞానము, గణితశాస్త్రము, ఖగోళశాస్త్రము, జ్యోతిషశాస్త్రము మొదలైన విషయములు

వేదములలో వివరింపబడి ఉన్నాయని ఈ ప్రసంగాల ద్వారా వక్తలు తెలియజేసారు. ఈ కార్యక్రమాన్ని 'ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ రీసెర్చ్ ఆన్ వేదాస్' (I-SERVE), హైదరాబాద్ మరియు 'ఉత్తరాంధ్ర వేద విద్యాపరిషత్', విశాఖపట్నం సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ కార్యక్రమాన్ని శ్రీ విజయకుమార్ గారు (విజయ్ నిర్మాణ్ కంపెనీ చైర్మన్) ప్రారంభించగా, తరువాత మాజీ మేయరుగారు శ్రీ డి.వి.సుబ్బారావుగారు ప్రేక్షకులతో వేదములు మనకి అందించిన విజ్ఞానము గురించి ప్రస్తుతించి, ప్రొఫెసర్ శ్రీ కె.వి.కృష్ణమూర్తి (I-SERVE చైర్మన్, హైదరాబాద్) గారిని మాట్లాడవలసినదిగా కోరగా, ఆయన తన ఉపన్యాసములో వైదిక విజ్ఞానమునకు, ఆధునిక విజ్ఞానమునకు గల తేడాలను, మరొక విధముగా తూర్పు దేశాలకు సంబంధించిన పద్ధతులకు, పశ్చిమ దేశస్తులకు సంబంధించిన పద్ధతులకు భేదములను వివరించారు. వేదములలో ఖగోళశాస్త్రముగురించి, గణితశాస్త్రముగురించి, అంతరిక్షముగురించి, మరెన్నో విషయములకు సంబంధించిన వివరములు ఉన్నాయని, ఆధ్యాత్మిక జ్ఞానము - ప్రపంచజ్ఞానము కంటే చాలా శక్తివంతమైనదని తెలియజేసారు. వేల సంవత్సరముల క్రితమే అనేక శాఖలకు సంబంధించిన వివరములు వేదగ్రంథములలో తెలుపబడినవని, నేటి మన అంకగణితము, క్షేత్రగణితము, బీజగణితము, త్రికోణమితి, జ్యామితి మొదలైన శాఖలను నాడే విశ్లేషించి వివరములను ఆ గ్రంథాలలో పొందుపరిచారని తెలియజేసారు. ఈ సందర్భములో ఆయన వేద ప్రమాణ ప్రసక్తి కలిగిన కొన్ని ప్రముఖమైన పుస్తకములను (శివతత్వ రత్నాకరము, బృహత్సంహిత మొదలైనవి) ప్రస్తావించారు.

తరువాత డా. వి.వి.కుటుంబరావుగారు (డైరెక్టర్, GITAM University, విశాఖపట్నం) వారి పరిశోధనల సారం సైన్స్ & టెక్నాలజీ ఆఫ్ మెటల్స్ ఫ్రమ్ వేదిక్ టైమ్స్' అన్న అంశముమీద, డా. రాణి సదాశివమూర్తిగారు (రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠము, తిరుపతిలో సీనియర్ లెక్చరర్) 'వేదిక్ సోర్సెస్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియన్ సైంటిఫిక్ డెవలప్మెంట్' అన్న అంశముమీద మాట్లాడారు. ఈ సందర్భములో మూర్తిగారు వేదములోని కొన్ని శ్లోకములను, వాటి అంతరార్థమును తెలియజెప్పారు. ఈ అంతరార్థమును తెలుసుకోడానికి, క్షుణ్ణంగా వేదములను చదవాలని, ఎంతో సాధన చెయ్యాలని తెలియజేసారు. అనంతరము డా. ఎస్. శివరామబాబుగారు (గుంటూరు జె.కె.సి కళాశాల రసాయణశాస్త్రవిభాగములో అధ్యాపకులు) నేడు చాలామంది మన వేదవిజ్ఞానాన్ని అవమానిస్తున్నారని, ఆధునిక శాస్త్రవేత్తలు క్రొత్త విషయాలు కనుగొన్న తరువాత మాత్రమే అవి మన వేదములలో ఉన్నాయని మనము తెలియజేస్తున్నామని చాలామంది విమర్శించడం గురించి ప్రస్తావించారు. మన వేదవిజ్ఞానాన్ని అందరికీ అందుబాటులో ఉండేటట్లు ఆంగ్లములోనికి తర్జుమా చెయ్యగలగాలని, దానికొఱకు సంస్కృతము క్షుణ్ణంగా తెలిసిన వారు వివిధ శాస్త్రీయ శాఖలలో అనుభవము ఉన్నవారు కలిసి పనిచెయ్యాలని, తద్వారా భవిష్యత్తులో ఈ విషయాలు వేదములలో ఉన్నాయని ఋజువు అవుతుందని విశదీకరించారు. ఈ సందర్భములో ఒక వ్యక్తి మరణానంతరము జరిపే కర్మకాండలో గోదానము ఇస్తారు. దాని అంతరార్థమును తెలియజేస్తూ ఆయన 'గో'కణము సత్వగుణమును,

'అశ్వ'కణము రజోగుణమును, 'అవి'కణము తమోగుణమును సూచిస్తాయని, 'గో'కణములను వృద్ధిచేసుకోవడముద్వారా ఒక వ్యక్తి ఆధ్యాత్మికముగా ఎదిగే అవకాశమున్నదని తెలియజేస్తుందని చెప్పి వివరించారు. కె.వి.కృష్ణమూర్తిగారు ఈ రోజు సదస్సులోని సారాంశమును క్లుప్తముగా తెలియజేసారు.

ప్రొఫెసర్ సి. శాంతమ్మగారు (భౌతికశాస్త్రవిభాగము, ఆంధ్రవిశ్వవిద్యాలయము, విశాఖపట్నం) వేదగణితమును గురించి, జగద్గురు శ్రీ భారతీకృష్ణతీర్థగారి కృషిని గురించి మాట్లాడారు. భారతీకృష్ణతీర్థగారి పుస్తకములోని సూత్రములను వివరిస్తూ శాంతమ్మగారు 5 సంపుటములు వెలువరించారు. చివరిలో సద్గురు శ్రీ శివానందమూర్తిగారు వక్తలను సత్కరించి, మెమెంటోలను బహూకరించారు.

*** *** ***

**శ్రీనివాసరామానుజన్ మేథమేట్రిక్స్ క్లబ్ నిర్వహించిన 'మేధావధానము'**

**తేదీ : మార్చి 30, 2008 సమయం : సాయంత్రం 4 నుండి 6:30 వరకు.**

**వేదిక : శ్రీకనకమహాలక్ష్మి కల్యాణమంటపం, విశాఖపట్నం.**

శ్రీనివాస రామానుజన్ మేథమేట్రిక్స్ క్లబ్ బేనరుతో సంఘమిత్ర ఆధ్వర్యములో, శ్రీ అయినాపురపు శ్రీనివాసరావుగారు మార్చి 30వ తేదీ ఆదివారము సాయంత్రము 4 గంటలకు శ్రీ కనకమహాలక్ష్మి కల్యాణమండపములో, పిల్లలతో, మేధావధానము అని పేరుపెట్టి కార్యక్రమం నిర్వహించారు. అతి తక్కువ వ్యవధిలో విద్యార్థులని తయారుచేసి ప్రోగ్రాం చెయ్యడం చాలా హర్షించదగినది. శ్రీనివాసరావుగారు అమెరికాలో కూడా భారతీయుల పిల్లలకి "వేదిక్ మేథమేటిక్స్" నేర్పించి, వారిచేత మేధావధానము కార్యక్రమం చేయించడం, భారతీయులతో పాటు ఎందరో అమెరికన్స్ కూడా పాల్గొని ఆనందించడం, వారికి కూడా నేర్పమని అడగడం గత సంవత్సరంలో జరిగింది.

విశాఖపట్టణంలో మార్చి 30ని జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావుగారు, ఆచార్య శ్రీ పోతుల గోపాలకృష్ణమూర్తిగారిని, శ్రీనివాసరావుగారి ఎలిమెంటరీ స్కూలు మాస్టర్ శ్రీ రామచంద్రమూర్తిగారిని, తెలుగుపండితులు శ్రీ రాచకొండ అప్పల నరసింహమూర్తిగారిని, ఆంధ్ర విశ్వవిద్యాలయ అధ్యాపకులు శ్రీ చల్లా శ్రీరామచంద్రమూర్తిగారిని, శ్రీనివాసరావుగారికి సర్వమూ తానే అయిన అన్నగారు శ్రీ అయినాపురపు వెంకట రాజేశ్వరరావుగారిని, వేదికపైకి ఆహ్వానించి, వారిని శాలువతో సత్కరించి, వారి అమూల్యమైన సందేశములను, ఆశీర్వచనములను అందుకున్నారు. ముఖ్యంగా ఆచార్య శ్రీ పోతుల గోపాలకృష్ణమూర్తిగారు వారికి తెలిసిన పూర్తి వివరాలు తెలియజేసి, ఇందులో అడుగుపెట్టిన శ్రీనివాస్ ముందడుగు వేస్తూ మనవారినేకాకుండా, అమెరికాలో కూడా ఎందరినో మేధావులను తయారుచెయ్యాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమానికి తయారయిన మేధావులు చిరంజీవులు పుసులూరి శ్రీచలం, ఏలూరి శ్రీ హర్ష, అయినాపురపు స్వాతి కీర్తన, ఏలూరి శ్వేతవాణి. పంచమ మూలములను, ఒక సంఖ్యను 9 చే భాగించునపుడు వచ్చు శేషమును చి|| పుసులూరి శ్రీచలం; ఘనమూలములను, రెండు వరుస సంఖ్యల వర్గముల బేధమును తెల్పిన, ఆ సంఖ్యలను చి|| ఏలూరి శ్రీహర్ష; అయిదు అంకెల సంఖ్యను

పదకొండుతో గుణిస్తే వచ్చే సంఖ్యను, 9996 x 9994 వంటి గుణకారములను చి॥ అయినాపురపు స్వాతి కీర్తన; అయిదు వరసల కూడికను చి॥ ఏలూరి శ్వేతవాణి; వారగణనం (1900 నుండి 2099 వరకు), 4 x 4 మాత్రికను (విడివిడిగా అడ్డవరుసలలోని సంఖ్యల మొత్తం, నిలువు వరుసలలో సంఖ్యల మొత్తం సమానంగా వచ్చేవిధముగా) సాధించడం, 1/59 లాంటి భిన్నమునకు ఆవర్తన దశాంశములను చెప్పడం లాంటివి శ్రీ అయినాపురపు శ్రీనివాసరావుగారు; పెన్సిలుగాని, కాలిక్యులేటర్ గాని, ఉపయోగించకుండా ప్రేక్షకులనుంచి వర్షంలా వచ్చిన ఏభైకి పైగా ప్రశ్నలకి సమాధానములు చెప్పి మంత్రముగ్ధులను చేసారు.

పిల్లలు సమాధానములు అంత త్వరగా ఎలా చెప్పారో; తెలుసుకోవాలనే కుతూహలము పిల్లలలోనూ, పెద్దలలోనూ స్పష్టముగా కనిపించింది. ఆసక్తి కలిగినవారు ఇరవై మంది మర్నాడు సాయంత్రం శ్రీనివాసరావుగారి వద్ద కొన్ని అంశములను నేర్చుకున్నారు.

శ్రీ యాజ్ఞవల్క్య మహర్షి వారసులైన ఈ మేధావులందరికి శ్రీ సర్వధారినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలతో శ్రీ యాజ్ఞవల్క్య మహర్షివారి అనుగ్రహం వీరికి ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదిస్తున్నది.

శ్రీ యాజ్ఞవల్క్య పరిషత్తు
విశాఖపట్నం.

*** *** ***

**బే ఏరియా తెలుగు సంఘం నిర్వహించిన సర్వధారి ఉగాది వేడుకలు.**
**తేది : ఏప్రియల్ 5, 2008 సమయము : ఉదయం 10 నుండి రాత్రి 9 గంటలవరకు.**
**వేదిక : సన్నీవేల్ హిందూ దేవాలయము, కాలిఫోర్నియా.**

సర్వధారి నామ ఉగాదిని పురస్కరించుకుని 'బే ఏరియా తెలుగు సంఘం' (బాటా) మరియు భారత్ ఫేమిలీ సంయుక్తంగా తెలుగు మేళాను, సన్నీవేల్ హిందూ దేవాలయములో నిర్వహించారు. ఉదయం 10 గంటలనుండి రాత్రి 9 గంటలవరకు నిర్వహించబడిన మేళా 'యువకుల/యువతుల టేలెంట్ షో', సాయంత్రము సాంస్కృతిక కార్యక్రమము, వివిధ రకముల తినుబండారముల దుకాణములు, వస్త్రములు, ఆభరణముల ప్రదర్శనలతో అన్ని రకములైన ప్రేక్షకులను ఆకట్టుకునే విధముగా రూపుదిద్దుకుంది.

యువతీయువకులకు, పిల్లలకు నిర్వహించిన సంగీత, నృత్య, గాన, చిత్రలేఖన పోటీలలో పాల్గొన్న ఎంతో మంది వారి సామర్థ్యాన్ని ప్రదర్శించారు. 3 సంవత్సరాల పిల్లలనుండి 16 సంవత్సరముల ప్రాయమువరకు సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగములలో 150 మందికి పైగా పాల్గొనడం విశేషం. విజయ ఆసూరి, శ్రీలు వెలుగేటి, ప్రీతి మరియు అపర్ణ పసుమర్తి నిర్వహణలో ప్రజ్ఞాపాటవ పోటీలు, శాస్త్రీయ, జానపద, సినిమా గీతములకు నృత్యము చక్కగా సాగాయి.

కార్యక్రమము నిర్వహించిన దేవాలయ ప్రాంగణము చక్కగా అలంకరించబడి, మామిడి ఆకుల తోరణములతో స్వాగతం పలుకగా, ఉగాది పచ్చడి రుచిని చూసిన ప్రేక్షకులు ఆంధ్రరాష్ట్రములో ఉన్న

అనుభూతిని పొందారు. శ్రీమతి విజయ ఆసూరి మరియు శ్రీమతి శ్రీలు వెలిగేటి సారధ్యంలో, 40 మంది పిల్లలతో రూపొందించిన 'సీతారామకల్యాణము'; అంజలి మరియు రమ్య శాస్త్రీయనృత్యము 'క్షీరాబ్ధికన్యకకు'; శ్రీ గొర్తి బ్రహ్మానందంగారు దర్శకత్వం వహించి, శిరీష, చక్రపాణి, ప్రసాద్, కామేష్ నటించిన 'ఉగాది స్పెషల్' ప్రేక్షకులను అలరించిన కార్యక్రమాలలో కొన్ని. కల్యాణ్ కట్టమూరి రచించి, శ్రీమతి శ్రీలు వెలుగేటి మరియు శ్రీమతి విజయ ఆసూరిచే కొరియోగ్రాఫ్ చేయబడిన "వెండితెర తళుకులు ... స్టార్ స్టడెడ్ ట్రిబ్యూట్ టూ టాలీవుడ్", "లేత మనసులు ... నానీస్ లవ్‌స్టోరీ", కల్యాణ్ కట్టమూరిచే దర్శకత్వం వహించబడిన "యువతరంగం ... యంగ్ వేవ్స్", హాస్య గల్పిక "టి.వి99 - చచ్చేదాక మీ వెంటే!" ప్రేక్షకులను అద్యంతం ఆనందపరవశులను చేసాయి. వేదికను అలంకరించడానికి, అమర్చడానికి, శబ్దగ్రహణం చేయడానికి వీరు ఉప్పల మరియు కరుణ్ వెలిగేటి పాత్ర ప్రశంసనీయం. ఈ కార్యక్రమము చక్కగా నిర్వహించబడడానికి తెరవెనుక శ్రమించిన 'బాటా' కార్యకర్తలు ప్రశంసాపాత్రులు. ఈ సందర్భములో శ్రీధర్ చావ సంపాదకత్వముతో 'తెలుగు-వెలుగు' ప్రత్యేక సంచిక వెలువరించబడినది.

పదవీ కాలము పూర్తి చేస్తున్న ప్రస్తుత అధ్యక్షుడు శ్రీ యుగంధర్ కరకాల మాట్లాడుతూ గత సంవత్సరములో 'బాటా' నిర్వహించిన కార్యక్రమములు 'ఉగాది - 2007', వాలీబాల్ పోటీలు, వేసవి వనభోజనములు, 'బాటా' కప్ క్రికెట్, స్వాతంత్ర్యదినోత్సవ కవాతు వేడుకలలో 'బాటా' ప్రదర్శనకు మొదటి బహుమతి రావడం, కాన్సర్ ఇన్స్టిట్యూట్ ఫౌండేషన్, శంకరా ఐ ఫౌండేషన్ మొదలైన సంస్థల కొఱకు విరాళములు సేకరించిన కార్యక్రమములను మరియు ఇండియా లిటరసీ ప్రోజెక్ట్‌లను ప్రస్తావించారు. ఈ సందర్భముగా యుగంధర్ పదవీకాలములో అతనికి చేయూతనిచ్చిన బాటా కమిటీ సభ్యులకు, కార్యకర్తలకు, స్పాన్సర్లకు, ప్రేక్షకులకు ధన్యవాదములు తెలిపారు.

తరువాత యువత ప్రతిభకు పెట్టిన పోటీలలో తెలుపొందిన వారికి బహుమతులను అందజేసారు. ఈ కార్యక్రమానికి రెండు వేలకు మించి ప్రేక్షకులు హాజరైనారు. వీరితో పాటూ అమెరికా తెలుగు అసోషియేషన్ (ఆటా), తెలుగు అసోషియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా), సి.ఐ.ఎఫ్, ఐ.ఎల్.పి, శంకరా ఐ ఫౌండేషన్ (ఎస్.ఇ.ఎఫ్), ఆషా, విభా, సి.ఆర్.వై, ఆనంద్ ఛారిటీ, అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ హెరిటేజ్ మొదలైన సంస్థల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

*** *** ***

**సెయింట్ లూయిస్ తెలుగు సంఘం నిర్వహించిన సర్వధారి ఉగాది వేడుకలు.**

**తేది : ఏప్రియల్ 12, 2008 సమయము : సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటలవరకు.**

**వేదిక : మహాత్మ గాంధి కల్చరల్ సెంటర్, సెయింట్ లూయిస్.**

సర్వధారి నామ ఉగాదిని పురస్కరించుకుని 'సెయింట్ లూయిస్ తెలుగు సంఘం' (టి.ఎ.ఎస్.ఎల్) మహాత్మ గాంధీ సెంటరులో, 400 మంది ప్రేక్షకుల సమక్షంలో, కార్యక్రమం నిర్వహించింది. ముందుగా దేవాలయ అర్చకులు శ్రీ శ్రీనివాస్ దీవిగారు పంచాంగశ్రవణం చేయగా, తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు, శ్లోకములు పఠించడము, పాటలు పాడడం, లఘు నాటకములను ప్రదర్శించారు.



ఈ కార్యక్రమము ప్రతినిముషము ఆసక్తికరంగా సాగేటట్లు నిర్వహించిన సంస్థ సారధులు అభినందనీయులు. చాలామంది పిల్లలు అన్నమాచార్య కీర్తనలు పాడడము, భరతనాట్యము, మోహినీ ఆట్టం వంటి శాస్త్రీయ నృత్యములను ప్రదర్శించడము, జానపద నృత్య ప్రదర్శనలు, సినిమా గీతములకు డాన్స్ చేయడము ఎంతో మంది తల్లిదండ్రులకు స్ఫూర్తినిచ్చి ఉంటుందనడంలో సందేహము లేదు. 'భద్రం - బీ కేర్‌ఫుల్ ' హాస్యనాటిక

**↑ శ్రీమతి స్మితా రాజన్‌గారి శిష్యురాలు శ్రావ్యశ్రీ అయినాపురపుచే ఋతువసంతం, మోహినీ ఆట్టం నాట్యం.**

ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. పాల్గొన్న పిల్లలకు పతకం, ప్రశంసాపత్రం అందజేసారు. చివరలో ఈ కార్యక్రమముకోసం శ్రమపడిన కార్యకర్తలను కార్యవర్గం అభినందించింది.




**కార్యక్రమము చివర జనగణమన పాడుతూ ...**



**అన్నమాచార్య కీర్తనకు డాన్స్ చేస్తూ**




**అన్నమాచార్య కీర్తనను ఆలాపిస్తూ ...**